సాక్షి నంద్యాల

శనివారం, 3, జూన్, 2023



శాస్త్రోక్తంగా ఊయల సేవ

శ్రీశైలంటెంపుల్: శ్రీభ్రమరాంబాదేవికి శుక్రవారం ఊయలసేవను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఊయలలో స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులను వుంచి పూజలు చేపట్టారు.



కేసీ కాల్వకు నీరు విడుదల

గూడూరు: సుంకేసుల రిజర్వాయర్ నుంచి కర్నూలు ప్రజల తాగు నీటి అవసరాల కోసం కేసీ కాల్వకు 180 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు డ్యామ్ అధికారులు తెలిపారు.



ఏఐ కోర్సు.. మంచి భవిష్యత్తు

విద్యార్థుల భవిష్యత్‌కు బంగారు బాటలు వేసే దిశగా రాయలసీమ యూనివర్సిటీ ఈ విద్యా సంవత్సరం నుంచి ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) కోర్సును ప్రవేశపెట్టింది. 8లో

న్యూస్‌రీల్

నాడు-నేడు పనులను త్వరితగతిన పూర్తి చేయండి



మాట్లాడుతున్న డీఈఓ అనురాధ

నంద్యాల(న్యూటౌన్): మన బడి నాడు-నేడు పనులను ఈనెల 10వ తేదీలోగా పూర్తి చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారిణి అనురాధ ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక వివేకానంద ఆడిటోరియంలో 12 మండలాలకు చెందిన ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ నాడు-నేడు పనుల్లో భాగంగా చేపట్టిన మరుగుదొడ్లు, మంచినీటి వసతి, ఎలక్ట్రీషియన్, మేజర్, మైనర్ కిచెన్ షెడ్లకు సంబంధించిన పనులన్నింటిని త్వరగా పూర్తి చేయాలన్నారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా పాఠశాలలు ప్రారంభించే రోజుకు అన్ని పనులు పూర్తి చేయించాలన్నారు. ప్రధానోపాధ్యాయులు రోజూ పాఠశాలలకు వెళ్లి పనుల పురోగతిని పరిశీలించి వెంటనే సమాచారం సంబంధిత కార్యాలయానికి చేరవేయాలన్నారు. సమావేశంలో ఎంఈఓ బ్రహ్మంనాయక్, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

స్పాట్ వాల్యుయేషన్‌కు హాజరు కావాలి

నంద్యాల(న్యూటౌన్): ఈనెల 3వ తేదీ నుంచి ప్రారంభమయ్యే ఇంటర్మీడియెట్ సప్లిమెంటరీ పరీక్షల స్పాట్ వాల్యుయేషన్‌కు అధ్యాపకులందరూ తప్పక హాజరు కావాలని ఆర్ఐఓ గురువయ్య శెట్టి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిజిక్స్, కెమిస్ట్రీ, ఎకనామిక్స్, కామర్స్, జువాలజీ సబ్జెక్టుల మూల్యాంకనకు అధ్యాపకులందరూ హాజరు కావాలన్నారు. రాని పక్షంలో చర్యలు తప్పవని హెచ్చరించారు.

'శాంతిరాం'కు అటానమస్ హోదా



మాట్లాడుతున్న చైర్మన్ శాంతిరాముడు

పాణ్యం: నెరవాడ మెట్ట వద్ద ఉన్న శాంతిరాం ఇంజినీరింగ్ కళాశాలకు అటానమస్ హోదా లభించిందని కళాశాల చైర్మన్ మిద్దె శాంతిరాముడు తెలిపారు. శుక్రవారం ఆయన కళాశాలలో మాట్లాడుతూ యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ నుంచి అటానమస్ స్టేటస్ గుర్తింపు రావడం సంతోషంగా ఉందన్నారు. 2009లో ప్రారంభమైన కళాశాలకు 2022లో ఎన్ఏఏసీ- ఏ గుర్తింపు లభించిందన్నారు. ఇటీవల యూజీసీకి సంబంధించిన ఐదుగురు సభ్యులు కళాశాలను పరిశీలించి 'స్వతంత్ర ప్రతిపత్తి' ధ్రువీకరించారన్నారు. పదేళ్లపాటు (2023-24 నుంచి 2032-33 వరకు) కళాశాలకు అటానమస్ హోదా కల్పించారన్నారు. ఇందుకు కృషి చేసిన కళాశాల ప్రిన్సిపాల్ సుబ్రమణ్యం, వివిధ విభాగ అధిపతులకు ఆయన అభినందనలు తెలిపారు.

పది పరీక్షలకు 837మంది గైర్హాజర్

నంద్యాల(న్యూటౌన్): జిల్లాలో శుక్రవారం పదో తరగతి అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. 47 పరీక్ష కేంద్రాల్లో జరిగిన తెలుగు పరీక్షకు 3,734 మంది విద్యార్థులకు గాను 2,897 మంది హాజరు కాగా 837 మంది గైర్హాజరయ్యారు. జిల్లా వ్యాప్తంగా మూడు ఫ్లయింగ్ స్క్వాడ్ టీంలు 19 పరీక్ష కేంద్రాలను పరిశీలించాయి. అలాగే డీఈఓ అనురాధ మూడు కేంద్రాలను, ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్ ఒక కేంద్రాన్ని తనిఖీ చేశారు. పరీక్ష కేంద్రాల వద్ద 144సెక్షన్ అమలు చేసినట్లు డీఈఓ తెలిపారు.

కేఎంసీకి 15 మైక్రోస్కోప్‌లు

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు మెడికల్ కాలేజీలో క్యాన్సర్ కేర్‌లో భాగంగా 15 మైక్రోస్కోప్‌లను శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేసి పంపింది. ఏపీఎంఎస్ఐడీసీ విభాగం వారు కొనుగోలు చేసి వీటిని కళాశాలకు పంపించారు. వీటిని కళాశాలలోని పెథాలజీ విభాగంలో ఉపయోగించుకోనున్నారు.

'కొండ'ంత భరోసా!



కలెక్టర్ నుంచి చెక్కు అందుకుంటున్న టి. నరసింహులు



కె.సావిత్రి భర్త వెంకట్రాముడు



మెహరున్నీసా



కె.రంగమ్మ



పి.దిలీప్ కుమార్‌రెడ్డి



కురువ లక్ష్మి



ఎల్.మహేష్



బోయ నరసింహులు

లక్షలాది జనం.. అడుగడుగునా నీరాజనం.. ఇసుకేస్తే రాలనంతగా కిక్కిరిసిన సభా ప్రాంగణం.. పులవర్షం కురిపిస్తూ స్వాగతం.. అన్నదాతకు పెట్టుబడి భరోసా కల్పించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్.. పత్తికొండ అభివృద్ధికి వరాల వర్షం కురిసింది. ఇదే ప్రాంతంలో పలువురు తమ సమస్యలను విన్నవించుకునేందుకు రాగా.. ఎంతో ఓపికతో తెలుసుకున్న సీఎం అండగా నిలవాలని కలెక్టర్‌కు ఆదేశించడం.. మరుసటి రోజే ఆ దిశగా చర్యలు ఊపందుకోవడం విశేషం.

బాధితులకు అండగా సీఎం వైఎస్ జగన్

- పత్తికొండ సభలో ఆరోగ్య సమస్యలపై పలువురి వేడుకోలు
- తక్షణ సాయంగా ఒక్కొక్కరికి రూ.లక్ష
- అండగా నిలవాలని కలెక్టర్‌కు ఆదేశం
- ఎప్పటిలానే విషం చిమ్మిన ఎల్లో మీడియా

కర్నూలు కల్చరల్: చెప్పాండంటే.. చేస్తాడంతే.. ఇది ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నైజం. గురువారం పత్తికొండ పర్యటనకు వచ్చిన సీఎంకు పలువురు బాధితులు తమ సమస్యలను విన్నవించుకున్నారు. అందరి సమస్యలను ఓపికతో విన్న ముఖ్యమంత్రి పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజనకు ఆదేశాలు జారీ చేశారు. అయితే ఎల్లో మీడియా తన విష ప్రచారాన్ని మరోసారి వండి వార్చింది. 'సాయం కోరి సీఎం సభ వద్దకు వస్తే తోసేశారు' అని ఈనాడు తన వక్రబుద్ధితో తప్పుడు వార్తను అచ్చేసింది. సీఎం ఆదేశాల మేరకు శుక్రవారం బాధిత కుటుంబ సభ్యులకు కలెక్టర్ తన కార్యాలయంలో ఒక్కొక్కరికి రూ.లక్ష చొప్పున చెక్కులను అందజేశారు.

ఆర్థిక సాయాన్ని అందుకున్న వారిలో..

- పత్తికొండకు చెందిన కె.సావిత్రి ఎనిమిది నెలల నుంచి గుండె, ఊపిరితిత్తుల సమస్య ఉందని సీఎం ఎదుట వాపోయారు.
- కౌతాళం మండలం తోవి గ్రామానికి చెందిన టి.నరసింహులు తాను పేదరికంలో ఉన్నానని.. కుమారునికి వైద్యం చేయించేందుకు ఆర్థిక సాయం అందజేయాలని సీఎంకు వినతి పత్రం అందజేశారు.
- కర్నూలుకు చెందిన మెహరున్నీసా తన కుమార్తెకు కిడ్నీ సమస్య ఉందని ఆర్థిక సాయం చేయాలని సీఎంకు విన్నవించారు.
- మద్దికెర మండలం గురుజాల గ్రామానికి చెందిన పి.దిలీప్ కుమార్‌రెడ్డి తాను తలసేమియా వ్యాధితో బాధపడుతున్నానని, నెలకు రెండు సార్లు రక్తం ఎక్కించుకోవలసి వస్తుందని.. ఆపరేషన్ చేయించుకునేందుకు ఆర్థిక స్తోమత లేక ఇబ్బందులు పడుతున్నట్లు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకొచ్చారు.
- నందవరం మండలం సోమలగూడూరు గ్రామానికి చెందిన బోయ నర్సింహులు తనకు కుడి కాలు, కుడి చేయి పని చేయడం లేదని.. ఆర్థిక సాయం చేయాలని సీఎంకు విన్నవించుకున్నారు.
- పత్తికొండ మండలం నక్కల దొడ్డి గ్రామానికి చెందిన కె.రంగమ్మ వికలత్వంతో ఉన్న తన కుమార్తెకు ఆర్థిక సహాయం చేయాలని ముఖ్యమంత్రికి విన్నవించుకున్నారు.
- ఆదోనికి చెందిన కురువ లక్ష్మి తన కుమార్తెలు ఇరువురికి సరిగా చూపు కనపడక అంధత్వంతో బాధపడుతున్నారని సీఎంతో వాపోయారు.
- పత్తికొండ మండలం పత్తికొండ గ్రామానికి చెందిన ఎల్.మహేష్ తన కుమార్తె మూగ మరియు చెవిటి సమస్యతో బాధ పడుతోందని, ఆదుకోవాలని సీఎం దృష్టికి తీసుకొచ్చారు.

ఆలూరు మండలం కోట వీధికి చెందిన పి.చిదానంద తన కుమారుడు వీరన్నకు కడుపు నొప్పి సమస్య ఉందని, ఆర్థిక సహాయం చేయాలని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకొచ్చారు. సీఎం ఆదేశాల మేరకు కలెక్టర్ వారికి రూ.లక్ష చెక్కును అందజేశారు. దాంతో పాటు కర్నూలు ప్రభుత్వాస్పత్రిలో చేర్చి చికిత్స అందించాలని ఆస్పత్రి సూపరింటెండెంట్ నరేంద్రనాథ్‌రెడ్డిని ఆదేశించారు. పరీక్షించిన వైద్యులు అతని ఆరోగ్య పరిస్థితిని కుటుంబ సభ్యులకు తెలియజేశారు. చిన్నపేగు మార్పిడి శస్త్రచికిత్స చేయాల్సి ఉందని, ఇందుకు దాత అవసరమన్నారు. ఇందుకు కొంత సమయం పడుతుందని, అప్పటి వరకు వీరన్నకు ఆసుపత్రిలోనే చికిత్స అందిస్తామన్నారు. అయితే కుటుంబ సభ్యులు దాత లభించినప్పుడు సమాచారం ఇస్తే తామే వీరన్నను తీసుకొస్తామని, అప్పటి వరకు తమ ఇంట్లోనే ఉంచుకుంటామని వెళ్లిపోయినట్లు అధికారులు తెలిపారు.



వీరన్న సమస్యను వింటున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి



కర్నూలు జిల్లా కలెక్టర్ సృజన నుంచి చెక్కు అందుకుంటున్న వీరన్న సోదరుడు

గంటల వ్యవధిలోనే..

మిడుతూరు: అలగనూరు గ్రామానికి చెందిన సుగదాసి రాజు కుమార్తె రాధకు రెండు కిడ్నీలు దెబ్బతిన్నాయి. వ్యాధితో బాధపడుతున్న కూతురును తీసుకొని గురువారం పత్తికొండతో వైఎస్సార్ రైతు భరోసా పథకం ప్రారంభోత్సవానికి విచ్చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసి సమస్యను విన్నవించుకున్నారు. సమస్య తీవ్రతను తెలుసుకున్న సీఎం మానవతా దృక్పథంతో రాధ కుటుంబానికి లక్ష రూపాయలు అందజేయాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ ఆదేశించారు. ఈ మేరకు కర్నూలులో ఉన్న బాధిత కుటుంబాన్ని డీఆర్వో పుల్లయ్య, మిడుతూరు తహసీల్దార్ సిరాజుద్దీన్ గురువారం రాత్రి కలిసి రూ. లక్ష చెక్‌ను అందజేశారు.



బాధిత కుటుంబానికి చెక్కును అందజేస్తున్న డీఆర్వో పుల్లయ్య, తహసీల్దార్ సిరాజుద్దీన్

భక్తులకు మరిన్ని వసతి సముదాయాలు

- దశల వారీగా నిర్మాణానికి చర్యలు
- మంత్రి కొట్టు సత్యనారాయణ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మల్లన్న దర్శనార్థం తరలివచ్చే భక్తుల రద్దీకి అనుగుణంగా క్షేత్రంలో అనువైన చోట్ల దశలవారీగా మరికొన్ని వసతి సముదాయాలను నిర్మించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ అధికారులను ఆదేశించారు. శుక్రవారం శ్రీశైలం చేరుకున్న మంత్రి దేవస్థానం ఆధ్వర్యంలో 220 గదుల సముదాయంతో నిర్మించిన గణేశ సదన్‌ను పరిశీలించారు. గణేశ సదనంలో ఏర్పాటు చేస్తున్న కౌంటర్లు, కార్యాలయ ప్రవేశం, రెస్టారెంట్, ప్రధాన బ్లాక్‌లోని గదులను మంత్రి పరిశీలించారు. గణేశ సదన్ నిర్మాణపు వివరాలను మంత్రికి ఈఈ ఎస్.లవన్న వివరించారు. గణేశ సదన్ ప్రాంగణానికి ఎడమవైపు ఆరుబయలు ప్రదేశంలో ఏర్పాటు చేస్తున్న పార్కింగ్ ప్రదేశాన్ని వీలైనంత మేరకు విస్తరించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. భక్తులు వసతి గదులు పొందేటప్పుడు వేచి ఉండేందుకు వీలుగా తగు సౌకర్యవంతమైన ఏర్పాటు చేయాలని సూచించారు. గణేశ సదన్ ప్రాంగణంలో ఆలయ వేళలు, ఆలయంలో నిర్వహించే ఆర్జితసేవల వివరాలు, దేవస్థానంలో నిర్వహిస్తున్న విరాళాల పథకాలు మొదలైన సమాచారాన్ని కూడా భక్తులకు అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రి కొట్టు సత్యనారాయణ మాట్లాడుతూ దాతల సహకారంతో భక్తులకు మరిన్ని వసతి గదులను నిర్మించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. భక్తులు విరివిగా విరాళాలు చెల్లించేందుకు వీలుగా నిర్మాణ ప్రతిపాదనలను గురించి తగు ప్రచారాన్ని కల్పించాలన్నారు. మంత్రి వెంట దేవస్థాన ఈఈ వి.రామకృష్ణ, ఎం.నరశింహారెడ్డి, భాస్కర్, డీఈ పి.చంద్రశేఖరశాస్త్రి, ఏఈ భువన్‌కుమార్, ఎం.ప్రణయ్ తదితరులు ఉన్నారు.



గణేశ సదన్ వివరాలు తెలుసుకుంటున్న మంత్రి కొట్టు సత్యనారాయణ

కులవివక్ష వీడి ఐక్యంగా జీవించండి

మంత్రాలయం: కులవివక్ష వీడి అందరూ ఐక్యంగా జీవించాలని ఎస్సీ కమిషనర్ చైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాద్ పిలుపునిచ్చారు. శుక్రవారం మండల పరిధిలోని సూగూరు గ్రామంలో జై భీమ్ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసి అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అంబేడ్కర్ అందరివాడని, ఆయన ఆశయ సాధనకు అందరూ కృషి చేయాలన్నారు. అంతకు ముందు నందవరం మండలం హాలహర్వి నుంచి సూగూరు గ్రామంలోని అంబేడ్కర్ విగ్రహం వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. జై భీమ్ అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో జైభీమ్ నాయకులు రంగన్న, ఎమ్మిగనూరు డీఎస్పీ సీతారామయ్య, సీఐ శ్రీనివాసులు, ఎస్ఐ కిరణ్, గోనెగండ్ల సర్పంచ్ ఐమావతి పాల్గొన్నారు.



అంబేడ్కర్ విగ్రహ ఆవిష్కరణలో పాల్గొన్న విక్టర్ ప్రసాద్

యాంత్రీకరణతో వ్యవసాయంలో లాభాలు

- జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్
- వైఎస్సార్ యంత్రసేవ పథకం కింద 114 ట్రాక్టర్లు, 4 వరి కోత యంత్రాలు పంపిణీ
- 153 సీహెచ్‌సీ గ్రూపులకు రూ.5.45 కోట్ల సబ్సిడీ విడుదల
- సీహెచ్‌సీ గ్రూపు ప్రతినిధులకు మెగా చెక్కు అందజేత

నంద్యాల: యాంత్రికరణ ద్వారా వ్యవసాయంలో పెట్టుబడి వ్యయం తగ్గించి లాభాలు పెంచాలనే లక్ష్యంతోనే రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అండగా నిలుస్తుందని కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ పేర్కొన్నారు. రైతులు కేవలం 10 శాతం డబ్బులు కడితే 40 శాతం సబ్సిడీ, 50 శాతం రుణంతో ట్రాక్టర్లు, కంబైన్డ్ హార్వెస్టర్లు ప్రభుత్వం పంపిణీ చేస్తుందన్నారు. శుక్రవారం గుంటూరు జిల్లా చుట్టుగుంట సర్కిల్లో ఏర్పాటు చేసిన రాష్ట్రస్థాయి వైఎస్సార్ యంత్రసేవా పథకం మెగా మేళా -2లో భాగంగా రైతులకు ట్రాక్టర్లు, హార్వెస్టర్లు పంపిణీ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జెండా ఊపి లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని కలెక్టరేట్‌లోని వైఎస్సార్ సెంటినరీ హాల్‌లో లైవ్ ద్వారా జిల్లా కలెక్టర్‌తో పాటు ఎమ్మెల్సీ ఇసాక్ బాషా, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ వంగాల భరత్ కుమార్ రెడ్డి, మార్క్‌ఫెడ్ చైర్మన్ పీపీ నాగిరెడ్డి, జాయింట్ కలెక్టర్ నిశాంతి తదితరులు వీక్షించారు. అనంతరం జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ మాట్లాడుతూ ప్రభుత్వం వైఎస్సార్ యంత్ర సేవా పథకం కింద జిల్లాలో 153 గ్రూపులకు 114 ట్రాక్టర్లు 4 వరి కోత యంత్రాలు పంపిణీ చేసిందన్నారు. జిల్లాలోని ఆళ్లగడ్డ నియోజకవర్గంలో 36 గ్రూపులకు రూ.151.74 లక్షలు, బనగానపల్లెలో 39 గ్రూపులకు రూ.132 లక్షలు, డోన్‌లో 20 గ్రూపులకు రూ. 515.41 లక్షలు, నందికొట్కూరులో 25 గ్రూపులకు 748.18 లక్షలు, నంద్యాలలో 12 గ్రూపులకు 473.33 లక్షలు, పాణ్యంలో 9 గ్రూపులకు రూ. 388.62 లక్షలు, శ్రీశైలంలో 12 గ్రూపులకు 492.79 లక్షలు మొత్తం 153 రైతు గ్రూపులకు రూ. 5.45 కోట్ల సబ్సిడీ మొత్తాన్ని జమ చేశామన్నారు. రైతు భరోసా కేంద్రాల్లో రైతులకు అవసరమైన యంత్రాలు అందుబాటులో ఉంచేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఖరీఫ్ సీజన్ దృష్టిలో ఉంచుకుని రైతులకు నాణ్యమైన విత్తనాలు పంపిణీ చేయడంతో పాటు ఇన్‌పుట్ సబ్సిడీ, పంటల బీమా, ఈ క్రాప్ బుకింగ్ తదితర అంశాలపై రైతుల్లో అవగాహన కల్పించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నట్లు కలెక్టర్ తెలిపారు.

- శాసనమండలి సభ్యులు ఇసాక్ బాషా మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం విత్తు నుంచి పంట కోత వరకు రైతులకు అండగా ఉంటుందన్నారు. వరి కోత మిషన్లపై 8.80 లక్షల రూపాయల వరకు సబ్సిడీ ప్రభుత్వం ఇస్తుందన్నారు. రైతులకు పంట సాగుకు ముందే పెట్టుబడి సాయం అందజేయడమే కాకుండా వ్యవసాయ యంత్రాలు పంపిణీ చేస్తూ అన్ని రకాలుగా అండగా జగన్‌మోహన్‌రెడ్డి నిలుస్తున్నారన్నారు.
- జిల్లా వ్యవ వ్యవసాయ సలహా మండలి చైర్మన్ వంగాల భరత్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ రైతాంగాన్ని ఆదుకునేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వైఎస్సార్ యంత్ర సేవా పథకాన్ని ప్రవేశపెట్టారన్నారు. వ్యవసాయ కూలీల కొరతను నివారించేందుకు రైతులకు వ్యవసాయ వాహన, యంత్ర పరికరాలు పంపిణీ చేయడం శుభపరిణామమన్నారు. గ్రామస్థాయిలోని రైతు భరోసా కేంద్రాల పరిధిలో సన్న, చిన్న కారు రైతులు గ్రూపుగా ఏర్పాటై రిజిస్ట్రేషన్ చేసుకుంటే ట్రాక్టర్లు, వరి కోత మిషన్లు మంజూరు చేస్తారన్నారు.
- ఏపీ మార్క్‌ఫెడ్ చైర్మన్ పీపీ నాగిరెడ్డి మాట్లాడుతూ తక్కువ ధరకే రైతులకు వ్యవసాయ యంత్రాలు పంపిణీ చేయడం ద్వారా రైతులకు పెట్టుబడి ఖర్చులు తగ్గుతాయన్నారు. పంట సాగు నుంచి పంట అమ్మకం వరకు రైతులకు అన్ని రకాలుగా అండగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఉంటున్నారన్నారు. అనంతరం పంపిణీ చేసిన ట్రాక్టర్లు, వరి కోత మిషన్ల వాహనాలకు కలెక్టర్, ఎమ్మెల్సీ తదితరులు జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం రాయితీ మొత్తంతో కూడిన చెక్కును రైతులకు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి మోహన్ రావు, జిల్లా ఉద్యాన శాఖ అధికారి నాగరాజు, పట్టు పరిశ్రమ అధికారి పరమేశ్వరి, వ్యవసాయ వ్యవసాయ అనుబంధ రంగాల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



వరికోత మిషన్లను జెండా ఊపి ప్రారంభిస్తున్న కలెక్టర్ మనజీర్ జిలానీ, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ భరత్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా, మార్క్‌ఫెడ్ చైర్మన్ పీపీ నాగిరెడ్డి తదితరులు




కలెక్టరేట్ వద్ద బారులుదీరిన యంత్రసేవా పథకం ట్రాక్టర్లు

ఐరిస్‌తో రేషన్


- బయోమెట్రిక్ సమస్యకు చెక్
- జిల్లాలో 351 ఎండీయూ వాహనాలకు ఐరిస్ పరికరాలు
- వేలి ముద్ర పడక పోయినా సరుకులు అందేలా ఏర్పాట్లు

కొలిమిగుండ్ల: రేషన్ కార్డుదారులందరికీ వంద శాతం నిత్యావసర సరుకులు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం నూతన విధానానికి శ్రీకారం చుట్టింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నిత్యావసర సరుకుల పంపిణీలో వినూత్న మార్పులు చేపట్టింది. జిల్లా వ్యాప్తంగా 5.33 లక్షల రేషన్ కార్డులున్నాయి. నేరుగా కార్డుదారుల ఇంటి వద్దకే సరుకులు పంపిణీ చేసేలా ఇది వరకే ఎండీయూ వాహనాలను ఏర్పాటు చేసింది. కాగా ఒక్కోసారి ఈ-పాస్ యంత్రాల్లో చాలా మంది వేలి ముద్రలు పడని కారణంగా సరుకులు కార్డుదారులకు అందడం లేదు. ప్రధానంగా కూలీ పనులు చేసుకునే వారి వేలిముద్రలు దాదాపుగా అరిగిపోయి ఉంటాయి. వృద్ధులు, మహిళలతో పాటు పలు వ్యాధిగ్రస్తుల చేతుల వేళ్ల ముడతలు పడి ఉంటాయి. దీంతో ఈ-పాస్ మిషన్ (బయోమెట్రిక్)లో వేలి ముద్రలు పడవు. ప్రతి నెలా చౌకదుకాణాల్లో సరుకుల కోసం వెళ్లిన వృద్ధులు, మహిళలు వేలి ముద్రలు పడక సరుకులు తీసుకోలేక పోతున్నామని ప్రతి సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమాల్లో అర్జీలు వస్తున్నాయి. ఎక్కువ భాగం బయోమెట్రిక్ పడటం లేదన్న సమస్యలు వస్తున్నాయి. ఈ సమస్యకు చెక్ పెడుతూ ప్రభుత్వం జూన్ నెల నుంచే ఐరిస్(కంటి) ఆధారిత ధ్రువీకరణతో సరుకుల పంపిణీకి శ్రీకారం చుట్టింది. రేషన్ సరుకుల పంపిణీకి బయోమెట్రిక్‌తోపాటు ఐరిస్(కంటి గుర్తింపు) విధానం అమలు చేస్తున్నారు. ఇప్పటి వరకు జిల్లాలోని 351 ఎండీయూ వాహనాల ఆపరేటర్లకు ఐరిస్ పరికరాలు అందజేసి వాటిపై శిక్షణ కల్పించారు. వేలి ముద్రలు పడని వారి ఐరిస్ సేకరించి పరికరంలో ఫీడ్ చేస్తారు. వేలిముద్రలు పడక పోతే ఐరిస్ ఆధారంగా రేషన్ సరుకులు అందించనున్నారు.



కార్డుదారుడి ఐరిస్ తీసుకుంటున్న దృశ్యం

ఎంతో ఉపయోగం



జిల్లాలో వంద శాతం రేషన్ కార్డులందరికీ రేషన్‌తో పాటు ఇతర సరుకులు అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇక నుంచి ఈ-పాస్‌తో పాటు ఐరిస్ మిషన్లతో కంటిని పరీక్షించి సరుకులు పంపిణీ చేయనున్నారు. ఎండీయూ వాహన ఆపరేటర్లకు అందరికీ పరికరాలు అందించి శిక్షణ అందించాం. ఇప్పటి నుంచి వేలిముద్రలు పడని రేషన్ కార్డుదారులందరికీ ఐరిస్ ఎంతో ఉపయోగంగా మారనుంది. – దోనీ ఆల్‌ఫ్రెడ్, తహసీల్దార్

క్లుప్తంగా

1,200 విద్యుత్ స్తంభాలు మంజూరు

కర్నూలు(రాజ్‌విహార్): ఉమ్మడి కర్నూలు జిల్లా అవసరాల కోసం 1,200 విద్యుత్ స్తంభాలు మంజూరయ్యాయి. వర్షాలు, ఈదురు గాలులు, చెట్ల కొమ్మలు విరిగి పడడం వంటి కారణాలతో విద్యుత్ స్తంభాలు విరిగిపోయే అవకాశాలున్నందున ఇక్కడి అధికారులు ఉన్నతాధికారుల నివేదికలు పంపారు. దీనిపై దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కె. సంతోషరావు స్పందించి కావాల్సిన మేరకు స్తంభాలు మంజూరు చేశారు. అనంతపురం, ఇతర జిల్లాల నుంచి ఇక్కడికి స్తంభాలు పంపించారు. ముందస్తు జాగ్రత్త చర్యలతో వాటిని తెప్పించినట్లు కర్నూలు, నంద్యాల జిల్లాల ఆపరేషన్స్ ఎస్ఈ ఎం. ఉమాపతి పేర్కొన్నారు.

ఉద్యాన శాఖలో బదిలీలు

కర్నూలు(అగ్రికల్చర్): ఉద్యాన శాఖలో పలువురు హార్టికల్చర్ అధికారులు బదిలీ అయ్యారు. కర్నూలు ఉద్యాన శాఖ జిల్లా అధికారి కార్యాలయంలో సాంకేతిక హార్టికల్చర్ అధికారిగా విధులు నిర్వహిస్తున్న మహబూబ్‌బాషా గుంటూరులోని కమిషనరేట్‌కు బదిలీ అయ్యారు. పత్తికొండ హార్టికల్చర్ అధికారి వై.అనూష జిల్లా అధికారి కార్యాలయంలో సాంకేతిక హెచ్‌వోగా నియమితులయ్యారు. అనంతపురం జిల్లా రాయదుర్గం హెచ్‌వో దస్తగిరి పత్తికొండ హెచ్‌వోగా బదిలీ అయ్యారు. అనంతపురం జిల్లాలో చందన ఆత్మకూరు హెచ్‌వోగా నియమితులయ్యారు.

6 లోపు సర్టిఫికెట్ల వెరిఫికేషన్

కర్నూలు సిటీ: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐ కాలేజీల్లో ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు ఈ నెల 6వ తేదీలోపు సర్టిఫికెట్ల వెరిఫికేషన్ చేయించుకోవాలని ఐటీఐ కాలేజీల కన్వీనర్ పి.వి ప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వెరికేషన్ కోసం టెన్త్ మార్కులు జాబితా, టీసీ, ఆధార్‌కార్డు వెంట తెచ్చుకోవాలని సూచించారు.

కేజీబీవీల్లో బదిలీలకు దరఖాస్తుల ఆహ్వానం

కర్నూలు(సిటీ): ఉమ్మడి కర్నూలు జిల్లాలోని కస్తూర్బా గాంధీ విద్యాలయాల్లో పనిచేస్తున్న బోధన, బోధనేతర సిబ్బంది బదిలీలకు ఈనెల 7 లోపు దరఖాస్తు చేసుకోవాలని సమగ్ర శిక్ష అదనపు కో ఆర్డినేటర్ డాక్టర్ కె.వేణుగోపాల్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 5 నుంచి బదిలీ ప్రక్రియ మొదలవుతుందని, ఇందుకు సంబంధించిన మార్గదర్శకాలను కేజీబీలకు పంపించామన్నారు. దరఖాస్తులు ఈనెల 7 లోపు కర్నూలు సమగ్ర శిక్ష కార్యాలయంలో అందజేయాలన్నారు.

మిగిలిన సీట్లకు దరఖాస్తు చేసుకోండి

పాణ్యం: నంద్యాల జిల్లా వ్యాప్తంగా ఉన్న బీసీ రెసిడెన్షియల్ బాల, బాలుర పాఠశాలలో మిగిలిన సీట్లకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కన్వీనర్ జయమ్మ శుక్రవారం తెలిపారు. పాణ్యం మండలం నెరవాడ మెట్ట బీసీ బాలికల పాఠశాలలో 6వ తరగతిలో బీసీ-1, ఎస్సీ-1, 7వ తరగతిలో బీసీ ఈ-1 ఖాళీగా ఉన్నట్లు పేర్కొన్నారు. ఆళ్లగడ్డ బాలికల పాఠశాలలో 6వ తరగతిలో బీసీ డీ -02, ఎస్సీ- 03, 7వ తరగతిలో బీసీ బీ-1, ఎనిమిదవ తరగతిలో బీసీ ఏ -02, బీసీ బీ- 01, బీసీ డీ-01, బీసీ ఈ - 02, అర్బన్-01, అలాగే తొమ్మిదవ తరగతిలో ఓసీ-01, ఎస్సీ-01, అర్బన్-01 చొప్పున సీట్లు ఖాళీ ఉన్నట్లు చెప్పారు. అలాగే బనగానపల్లె బాలుర పాఠశాలలో తొమ్మిదవ తరగతిలో బీసీ-02 , బేతంచెర్లలో తొమ్మిదవ తరగతిలో బీసీ ఏ - 2 సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. ఈనెల 8వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని, 10న ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. వివరాలకు 7780712810ను సంప్రదించాలన్నారు.

ఏఐ కోర్సు.. మంచి భవిష్యత్తు

- రాయలసీమ విశ్వవిద్యాలయంలో ఈ ఏడాది నుంచి కృత్రిమ మేధ కోర్సు
- ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ కోర్సులో 60 సీట్లకు అనుమతి
- కంప్యూటర్ సైన్స్ విభాగంలో 60 నుంచి 120 సీట్లకు పెంపు



కర్నూలు (న్యూసిటీ): విద్యార్థుల భవిష్యత్‌కు బంగారు బాటలు వేసే దిశగా రాయలసీమ యూనివర్సిటీ ఈ విద్యా సంవత్సరం (2023–24) నుంచి ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) కోర్సును ప్రవేశపెట్టింది. ప్రతిభా వంతులైన విద్యార్థులు నామమాత్రపు ఫీజుతో ఈ కోర్సు చదివే అవకాశం కల్పిస్తోంది. కోర్సులో 60 సీట్లకు అఖిల భారత సాంకేతిక ఉన్నత విద్యామండలి నుంచి అనుమతి లభించింది. దీంతోపాటు కంప్యూటర్ సైన్స్ విభాగంలో ప్రస్తుతమున్న 60 సీట్లను గాను 120 సీట్లు పెంచుకోవడానికి అనుమతి వచ్చినట్లు సమాచారం. కృత్రిమ మేధ కోర్సు రాయలసీమ యూనివర్సిటీలో ప్రారంభిస్తుండడంతో విద్యార్థులు పోటీ ప్రపంచంలో నిలదొక్కుకునేందుకు అవకాశం ఏర్పడనుంది.

ఇవీ ఉపయోగాలు..

కంప్యూటర్లు, రోబో లాంటి యంత్రాలు చేసే ప్రతి పనికి ప్రోగ్రామ్‌లు అవసరం. ఇలా ప్రోగ్రామ్‌ల అవసరం లేకుండానే పరిసరాల్లో మార్పులకు అనుగుణంగా ఆలోచించగలగడం, నేర్చుకోగలగడం, సొంతంగా నిర్ణయాలు తీసుకునే సామర్థ్యం కలిగి ఉండటాన్నే ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) అంటారు. ఫిన్‌ల్యాండ్ శాస్త్రవేత్తలు గుండె జబ్బుల్ని డాక్టర్ల కంటే ముందుగానే కనిపెట్టే ఏఐని అభివృద్ధి చేశారు. హార్ట్‌బీట్‌ను అంచనావేస్తూ ఇది పనిచేస్తుంది. దీంతో భవిష్యత్తులో గుండెపోటు వచ్చే అవకాశాల్ని ముందుగానే గుర్తించి చెబుతుంది. మెయిల్స్, మెసేజ్‌లలో ముఖ్యమైనవాటిని గుర్తించి నోటిఫికేషన్లుగా చూపే యాప్స్ ఇలా ప్రతి విషయంలో ఏఐ కీలకంగా మారింది.

ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ ఎందుకంటే?

సామాన్య ప్రజల జీవితాన్ని సులభతరం చేయడానికి ఏఐని ఉపయోగించవచ్చు. డాక్యుమెంట్ వెరిఫికేషన్ తగ్గించడం, ప్రభుత్వ ప్రక్రియలను వేగవంతం చేయడానికి ఏఐ ఉపయోగపడుతోంది. రాబోయే రోజుల్లో దీని వినియోగం విస్తరిస్తుంది. ఇప్పటికే ఫార్మా, కార్లు, ఇన్సూరెన్స్ ఏజెన్సీ, మొబైల్ కంపెనీలు ఏఐని విరివిగా ఉపయోగిస్తున్నాయి. ప్రస్తుతం సెల్‌ఫోన్లలో కూడా ఏఐ టెక్నాలజీని వినియోగిస్తున్నారు.

విద్యార్థుల భవిష్యత్తే ముఖ్యం



రాయలసీమ విశ్వవిద్యాలయంలో విద్యార్థుల కోసం ఈ విద్యా సంవత్సరం నుంచి ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ కోర్సు ప్రవేశపెడుతున్నాం. అలాగే విద్యార్థులు పోటీ ప్రపంచంలో నిలదొక్కుకోవడానికి స్పోకెన్ ఇంగ్లిషు, బ్యాంకింగ్‌పై అవగాహన సదస్సులను ఏర్పాటు చేస్తున్నాం, గ్రూపు 1,2 పోటీ పరీక్షలకు కూడా నిపుణులతో శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నాం. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ కోర్సుకు డిమాండ్ ఉండడంతో ఉపాధి అవకాశాలు అధికం. – ఆచార్య ఎ.ఆనందరావు (ఉపకులపతి, రాయలసీమ విశ్వవిద్యాలయం)

చాలా సంతోషంగా ఉంది



రాయలసీమ విశ్వవిద్యాలయంలో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ కోర్సు ప్రవేశపెట్టడం చాలా సంతోషంగా ఉంది. బ్రాంచ్‌లతో సంబంధం లేకుండా ప్రతిఒక్కరికీ ఈ కోర్సు ఉపయోగపడుతుంది. గేమ్‌ని తయారు చేయాలంటే దానికి కావాల్సిన కోడ్‌ను ఏఐ తయారు చేసి ఇవ్వగలదు. పోలీసులు కూడా క్రైం నియంత్రణకు ఈ సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగిస్తారు. సివిల్,విభాగంలో భవనాలను విన్నూత్న రీతిలో ఇది డిజైన్ చేసి ఇస్తుంది. – నిఖిల్ (సివిల్, 3వ సంవత్సరం)

సాంకేతిక విప్లవం



ఏఐతో సాంకేతిక విప్లవంతో అగ్రగామికి వెళ్లింది. రాబోయ వృద్ధిని అంచనా వేయడానికి ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ ఉపయోగపడుతుంది. పారిశ్రామిక రోబోట్‌లు, స్వయం ప్రతిపత్తి వాహనాలు, డ్రోన్‌లు, ఆటోమేటెడ్ సిస్టమ్‌లను రూపొందించడం, నియంత్రించడానికి ఏఐ ఉపయోగపడుతుంది. మెకానికల్ విభాగంలో చూసుకుంటే వాహనం భాగాలు, డిజైన్‌లను కొత్త పద్ధతిలో నిర్మాణం చేసి ఇవ్వగలదు. – ఎ.వీణా, (ఈసీఈ, 3వ సంవత్సరం)

విద్యార్థులకు ఉపయోగకరం



ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ కోర్సు విద్యార్థులకు ఉపయోగకరంగా ఉంటుంది. ఈ కోర్సు ప్రైవేట్ కాలేజీల్లో చదువుకోవాలంటే రూ.లక్షలు వెచ్చించాల్సి ఉంటుంది. అదే రాయలసీమ యూనివర్సిటీలో నామ మాత్రపు ఫీజుతో చదువుకోవచ్చు. ఈ విద్యా సంవత్సరం నుంచి కోర్సు ప్రారంభమవుతుంది. – హరిప్రసాద్ రెడ్డి (ప్రిన్సిపాల్, ఇంజినీరింగ్ కాలేజీ)

జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తుంది



జాతీయ విద్యావిధానంలో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ కోర్సు భాగమైంది. రాబోయే రోజుల్లో ఏ కోర్సు చదివా ఉద్యోగం చేయాలంటే ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ అవసరమవుతుంది. అన్ని రంగాల్లో ఈ కోర్సు తనదైన ముద్ర వేసి జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తుంది. సివిల్, మెకానికల్, కంప్యూటర్ సైన్స్ టెక్నికల్ కోర్సులే మిగతా వాటికి కూడా ఉపయోగపడుతోంది. రాబోయే రోజుల్లో గణిత శాస్త్రం చదువుకునే విద్యార్థులకు ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో ఉద్యోగావకాశాలు ఎక్కువగా ఉంటాయి. –ఆచార్య సుందరానంద పుచ్చ (రిజిస్ట్రార్, రాయలసీమ విశ్వవిద్యాలయం)

ఆశల విత్తు



అన్నదాతలు విత్తన పనులు మొదలు పెట్టారు. హొళగుంద మండలంలో గురువారం భారీ వర్షం కురవడంతో పొలాలు తడిసి ముద్దయ్యాయి. భూమి తడి ఆరకముందే ఎర్రరేగడి భూములున్న రైతులు పత్తి విత్తనం వేస్తున్నారు. హొళగుంద –ఆలూరు రోడ్డు సమీపంలోని పొలాల్లో శుక్రవారం విత్తనాలు పెడుతున్న కూలీలు, గుంటుక పాస్తున్న రైతులు కనిపించారు. – హొళగుంద

ఆరు మండలాల్లో వర్షం

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లాలో గురువారం సాయంత్రం నుంచి శుక్రవారం వరకు ఆరు మండలాల్లో వర్షం కురిసింది. హొళగొంద 48, ఆలూరులో 18.2, కౌతాళంలో 14.2, కోసిగిలో 12.6, ఓర్వకల్లులో 3.8, ఎమ్మిగనూరు మండలంలో 1.4 మి.మీ. ప్రకారం వర్షపాతం నమోదైంది. ఉరుములు, మెరుపులతో వర్షాలు పడే సమయంలో చెట్లు కింద, టవర్స్, పోల్స్ దగ్గర, బహిరంగ ప్రదేశాల్లో ఉండటం మంచిది కాదని బనవాసి కృషి విజ్ఞాన కేంద్రం వాతావరణ శాస్త్రవేత్త మహదేవయ్య తెలిపారు. కాగా.. జిల్లాలో ఉష్ణోగ్రతలు అదుపులోకి రావడం లేదు. ఇప్పటికీ 43–44 డిగ్రీల వరకు నమోదవుతున్నాయి.

ఈ కేవైసీ తప్పనిసరి

కర్నూలు(అగ్రికల్చర్): పెన్షనర్లు విధిగా ఈ–కేవైసీ చేసుకోవాలని జిల్లా ఖజానా అధికారి రామచంద్రరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 17,634 మంది పెన్షనర్లు ఉండగా ఇప్పటి వరకు 12,150 మంది ఈ కేవైసీ చేయించుకున్నారని, ఇంకా 5,484 మంది ఈ ప్రక్రియను పూర్తి చేసుకోవాల్సి ఉందని పేర్కొన్నారు. పెన్షనర్లు అందరూ ఈ–కేవైసీ చేయించుకునేందుకు వీలుగా జిల్లాలోని ప్రతి సబ్ ట్రెజరీలో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ నెల 4వ తేదీ ఆదివారం సెలవు అయిన్పటికీ అన్ని సబ్ ట్రెజరీలు పనిచేస్తాయని పేర్కొన్నారు.

జూనియర్ లెక్చరర్ల బదిలీలకు వెబ్ కౌన్సెలింగ్

కర్నూలు సిటీ: జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో పని చేస్తున్న లెక్చరర్లను వెబ్ కౌన్సెలింగ్ ద్వారా బదిలీ చేయనున్నారు. షెడ్యూల్ ప్రకారం శనివారం రోపు బదిలీలకు దరఖాస్తు చేసుకుని, దరఖాస్తును ఆయా కాలేజీల ప్రిన్సిపాళ్లకు అందజేయాలి. ప్రిన్సిపాళ్లు ఇంటర్మీడియెట్ జిల్లా వృత్తి విద్యాధికారికి అందజేస్తే ఈ నెల 7వ తేదీలోపు సీనియారిటీ జాబితా తయారు చేయాలి. ఈ జాబితాలోని వారి నుంచి 13వ తేదీ లోపు అభ్యంతరాలు స్వీకరించి, అదే రోజు పరిష్కారం చేసిన 14న కౌన్సెలింగ్ నిర్వహించాల్సి ఉంది. బదిలీ అయిన వారు 15న కాలేజీలకు వెళ్లి రిపోర్ట్ చేసుకోవాలి. జిల్లాలోని ప్రభుత్వ కాలేజీల్లో మొత్తం 205 మంది జూనియర్ లెక్చరర్లు ఉన్నారు. జీరో సర్వీసు నిబంధన ఉండడంతో ఎక్కువ మంది దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంది. అయితే సాంకేతిక కారణాలతో ఆన్‌లైన్ దరఖాస్తుల లింక్ శుక్రవారం ఓపెన్ కాలేదు.

నేడు వాహనాల వేలం

బొమ్మలసత్రం: నంద్యాల జిల్లా పరిధిలోని సబ్ డివిజన్‌లలో మద్యం అక్రమ రవాణా కేసుల్లో పట్టుబడిన 86 వాహనాలను ఆయా డివిజన్‌లకు చెందిన డీఎస్పీల ఆధ్వర్యంలో శనివారం వేలం నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎస్పీ రఘువీర్ రెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. నంద్యాల సబ్ డివిజన్ పరిధిలో 9 బైక్‌లు, 5 ఆటోలు, 1 కారును జిల్లా పోలీసు కార్యాలయం ఎదురుగా ఉన్న మైదానంలో, ఆళ్లగడ్డ సబ్ డివిజన్‌లో 2 బైక్‌లు, 1 ఆటోను ఆళ్లగడ్డ రూరల్ పోలీస్‌స్టేషన్‌లో, డోన్ సబ్ డివిజన్‌లో 8 బైక్‌లు, 3 ఆటోలు, 2 కార్లు బనగానపల్లె పోలీస్‌స్టేషన్‌లో, ఆత్మకూరు సబ్ డివిజన్‌లో 52 బైక్‌లు, 2 ఆటోలు, 1 కారును ఆత్మకూరు పోలీసు స్టేషన్‌లో వేలం వేస్తున్నామన్నారు. అదే విధంగా నందికొట్కూరు సర్కిల్‌కు సంబంధించిన వాహనాలు ఈ నెల 4వ తేదీన బ్రాహ్మణకొట్కూరు పోలీసు స్టేషన్‌లో వేలం వేయనున్నట్లు పేర్కొన్నారు.

అగ్నిమాపక శాఖలో పలువురి బదిలీలు

కర్నూలు (టౌన్): అగ్నిమాపక శాఖలో ఫైర్‌మెన్లు, డ్రైవర్ ఆపరేటర్లు బదిలీ అయ్యారు. కర్నూలు అగ్నిమాపక శాఖలో ఫైర్‌మెన్‌గా పనిచేసే డి. రవీంద్రనాథ్‌ను డోన్ ఫైర్ స్టేషన్‌కు, ఆత్మకూరు ఫైర్‌మెన్ ఎస్. హిమామ్ కాశీమ్‌ను బనగానపల్లెకు, నంద్యాల ఫైర్ స్టేషన్‌లో పనిచేసే జి. దిండేశ్వర్లును శ్రీశైలానికి, అక్కడ పనిచేసే రఫీక్ హుస్సేన్‌ను ఆత్మకూరుకు, ఆత్మకూరు ఫైరమెన్ సురేష్‌కుమార్‌ను శ్రీశైలానికి, కోడుమూరులో పనిచేసే జి.కె. రాజశేఖర్‌ను డోన్‌కు ఆత్మకూరులో పనిచేసే ఎస్. శ్రీనివాసులును నంద్యాల ఫైర్ స్టేషన్‌కు, కోడుమూరు ఫైర్ స్టేషన్‌లో పనిచేసే ఎం. జయరాముడును కర్నూలు ఫైర్ స్టేషన్‌కు, అలాగే కర్నూలులో డ్రైవర్ ఆపరేటర్‌గా పనిచేసే ఎం.భాస్కర్ రెడ్డిని బనగానపల్లెకు బదిలీ చేశారు.

హోటళ్లపై విజిలెన్స్ అధికారుల దాడులు

- ఆరు హోటళ్లకు రూ.2.75 లక్షల జరిమానా

నంద్యాల(సిటీ): పట్టణంలోని పలు హోటళ్లపై విజిలెన్స్ అధికారులు ఆకస్మిక దాడులు చేశారు. రీజనల్ విజిలెన్స్ ఆఫీసర్ ఎస్.పూజిత, అడిషనల్ ఎస్పీ కర్నూలు వారి ఆదేశాల మేరకు శుక్రవారం పట్టణంలోని పలు హోటళ్ల, రెస్టారెంట్లలో అధికారులు తనిఖీలు చేశారు. ఈ మేరకు నాసిరకమైన ఆహార పదార్థాలతో పాటు మాంసం నిల్వ చేయడం, అపరిశుభ్ర వాతావరణంలో ఆహారాన్ని నిల్వ ఉంచడంతో ఆరు హోటళ్లకు రూ.2.75 లక్షలు జరిమానా విధించామన్నారు. స్థానిక పద్మావతినగర్‌లోని కిచెన్ గార్డెన్ హోటల్‌కు రూ.30వేలు, మహారాజ హోటల్‌కు రూ.60వేలు, హైదరాబాద్ చెఫ్ హోటల్‌కు రూ.30వేలు, క్లాసిక్ జైల్ రెస్టారెంట్‌కు రూ.25 వేలు, 9 ఆర్‌క్లాడ్స్ రెస్టారెంట్‌కు రూ.60 వేలు, ఆర్ఆర్ ప్యారడైజ్‌కు రూ.50 వేలు జరిమానా విధించామన్నారు. ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని హోటళ్ల, ఇతర ఆహార పదార్థాలను విక్రయించే వారు నాణ్యమైన ఆహారాన్ని ఆహ్లాదకరమైన వాతావరణంలో అందించాలన్నారు. దాడుల్లో జప్తు చేసుకున్న ఆహార పదార్థాలను మున్సిపల్ అధికారులు డంప్‌యార్డుకు తరలించామన్నారు. ఈ దాడుల్లో విజిలెన్స్ అధికారులు నాయక్, మున్సిపల్ శానిటరీ సూపర్‌వైజర్ లక్ష్మీనారాయణ, మున్సిపల్, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



క్లాసిక్ జైల్ రెస్టారెంట్‌లో నిల్వ ఉంచిన ఆహార పదార్థాలను తనిఖీ చేస్తున్న విజిలెన్స్ అధికారులు

నంద్యాల రైల్వే స్టేషన్ మేనేజర్‌గా దొరస్వామి



స్టేషన్ మేనేజర్ వెంకటాద్రి దొరస్వామిని సన్మానిస్తున్న రైల్వే సిబ్బంది

నంద్యాల(రూరల్): నంద్యాల రైల్వే స్టేషన్ మేనేజర్‌గా వెంకటాద్రి దొరస్వామి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పని చేస్తున్న షేక్ అబ్దుల్‌వహాబ్ పదవీ విరమణ పొందడంతో, మహానంది మండలం గాజులపల్లె రైల్వే స్టేషన్ మేనేజర్‌గా పని చేస్తున్న దొరస్వామిని రైల్వే ఉన్నతాధికారులు ఇక్కడికి బదిలీ చేశారు. బాధ్యతలు స్వీకరించిన దొరస్వామిని రైల్వే సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టేషన్, సిబ్బంది సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకొని వెళ్లి పరిష్కరిస్తామన్నారు.

అక్రిడిటేషన్ కార్డుల పంపిణీ

నంద్యాల: జిల్లాలో ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా సంస్థలలో పనిచేస్తున్న అర్హులైన వర్కింగ్ జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులు పంపిణీ చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ తెలిపారు. శుక్రవారం ఆయన చాంబర్‌లో 2023–24 సంవత్సరానికి నూతన జిల్లాలో వర్కింగ్ జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రెండేళ్ల కాలపరిమితితో జిల్లాలోని జర్నలిస్ట్‌లకు అక్రిడిటేషన్లు ఇచ్చామన్నారు. నిబంధనల ప్రకారం మొదటి విడతలో 305 మందికి మంజూరు చేశామని, రెండో విడతలో మిగిలిన వారికి అందజేస్తామన్నారు.

6న ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు అవగాహన

కర్నూలు కల్చరల్: భారత చిన్న పరిశ్రమల అభివృద్ధి బ్యాంకు (ఎస్ఐడీబీఐ) సౌజన్యంతో నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ఎంఎస్ఎంఈ ఆధ్వర్యంలో ఈనెల 6వ తేదీన ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు పరిశ్రమల స్థాపనపై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ నీరజ తెలిపారు. కర్నూలు నగర శివారులోని నందికొట్కూరు రోడ్డులోని సెయింట్ జోసెఫ్ మహిళ కళాశాలలో ఈ సదస్సు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఆసక్తి గల వారు 6వ తేదీ ఉదయం 9 గంటలకు కళాశాలకు వచ్చి రిజిస్ట్రేషన్ చేసుకుని సదస్సులో పాల్గొనాలన్నారు. మరిన్ని వివరాలకు సెల్: 90146 85904 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

‘స్నేక్’ హితుడు



పాము కనిపిస్తే ఎంత ధైర్యవంతుడైనా వణికి పోవాల్సిందే. వామ్మో పాము అని పరుగులు తీయాల్సిందే. అయితే కోసిగి పర్సాగేరి కాలనీలో నివాసం ఉంటున్న సర్సారెడ్డి మాత్రం పాము కనిపిస్తే చేతితో పట్టుకుని ఆట ఆడిస్తాడు. దాని చంపకుండా వదిలేస్తాడు. వ్యవసాయ పనులు చేసుకుని జీవనం సాగించే సర్సారెడ్డి శుక్రవారం ఇంటి పరిసర ప్రాంతాల్లో నాగు పాము కనిపించడంతో చేతితో పట్టుకున్నాడు. కాసేపు పామును మెడలో వేసుకుని ఆడించాడు. అనంతరం పామును బైక్‌లో సైడ్ బ్యాగులో వేసుకుని సురక్షితంగా వ్యవసాయ పొలాల్లో వదిలేశాడు. ఎవరింట్లో నైనా పాము కనిపిస్తే తన సెల్ నంబర్ 9000735042కు ఫోన్ చేయవచ్చన్నారు. పామును పట్టుకుని సురక్షితంగా దూరప్రాంతాల్లో వదిలేస్తానన్నారు. – కోసిగి

కర్నూలు వ్యవసాయ మార్కెట్ కమిటీ ధరలు (క్వింటాల్‌కు రూ.లలో)

పంట	కనిష్టం	గరిష్టం
వేరుశెనగ	5315	7819
పొద్దుతిరుగుడు	3409	3409
ఆముదం	5060	5110
వాము	6669	25199
ఉల్లి	819	819
ఎండుమిర్చి	6199	19105
శనగలు	4060	4560
కందులు	5150	9556
మొక్కజొన్న	1230	1736
మినుములు	5590	7510

ఆకులో ఆకునై.. మయూర రూపమై !

చూసే చూపులో కాస్త కళాత్మకత ఉండాలే కానీ ప్రకృతిలో ప్రతీదీ అందంగానే కనిపిస్తుంది. పచ్చటి చెట్లు...పంటపొలాలు...ఆకాశంలోనూ ప్రకృతి అందాలను ఆస్వాదించవచ్చు. మోడు వారిన ఓ చెట్టుకు వివిధ రకాల తీగజాతి చెట్లు అల్లుకుపోయి అచ్చం మయూరంలా ముక్కు, నోరు, పింఛంలా ఒదిగిపోయిన ఈ దృశ్యం మహానంది–గాజులపల్లె మార్గంలో ఆకట్టుకుంటుంది. – మహానంది

